కూల్చారు సరేే.. నిర్మాణమెప్పుడో..?

- నిధులు మంజూరైనా పనుల జాడేది?
- స్థల సేకరణతో జాప్యం
- అద్దె భవనంలో అరకొర వసతులు
- ఇబ్బంది పడుతున్న జనం


మున్సిపల్ పాతభవనాన్ని కూల్చి చదును చేసిన స్థలం

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ కార్యాలయానికి పనుల నిమిత్తం వెళ్లేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు మూడంతస్తులపైకి ఇరుకు మెట్లపై నుంచి రాలేక పోతున్నారని పట్టణానికి చెందిన వినయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్ పంచాయతీగా ఉన్న పెద్దపల్లిని నగరపంచాయతీ, ఆ పై మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. దీనికనుగుణంగా కార్యాలయ భవనాన్ని నిర్మించాలని నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి కేటీ రామారావు స్వయంగా పెద్దపల్లిలోనే ప్రకటించారు.

స్థలసేకరణ కోసం..

మున్సిపల్ ఆఫీస్ ఆవరణలోనే ఉన్న గ్రంథాలయ భవనాన్ని ఆనుకుని ఉన్న ఆర్‌అండ్‌బీ డీఈఈ ఆఫీసు స్థలాన్ని కలుపుకుని కార్యాలయం నిర్మించాలనే ఆలోచనతో ఉన్నతాధికారుల ద్వారా ప్రయత్నాలు సాగించడంతో కొంత జాప్యం జరిగింది. ఎట్టకేలకు గ్రంథాలయం, ఆర్‌అండ్‌బీ డీఈఈ ఆఫీసులు ఖాళీ కావడంతో వాటిని కూల్చి వేయించి చదును చేశారు.

ఇరుకుగదులతో ఇబ్బందులు..

కొత్త భవనాన్ని నిర్మించాలని నిర్ణయించిన అధికారులు కార్యాలయాన్ని ప్రగతినగర్ ప్రాంతంలోని ఓ మూడంతస్తుల అద్దె భవనంలోకి మార్చారు. అయితే ఆ భవనంలో ఉన్న కార్యాలయానికి వెళ్లేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మూడంతస్తుల భవనంలోకి మార్చిన కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు కూడా విధులకు వెళ్లి రావడం కష్టంగానే ఉందంటున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులైతే తమకు కార్యాలయంలో ఏమైనా పనులు అవసరమైతే రోడ్డుపైనే నిరీక్షించాల్సిన పరిస్థితులున్నాయి. కొత్త భవనం నిర్మాణం అయ్యేవరకు ప్రజలందరికీ అనుకూలంగా ఉన్న భవనంలోకి మార్చాలని పలువురు కోరుతున్నారు.

పనులు మొదలయ్యేదెప్పుడో...!

పాత భవనాలను కూల్చి కొత్త భవనాన్ని నిర్మించేందుకు వీలుగా స్థలాన్ని చదును చేసిన అధికారులు మున్సిపల్ కార్యాలయ కొత్త భవన నిర్మాణపు పనులు ఇంకా మొదలు కాలేదు. ఇప్పటికే రెండుసార్లు శిలాఫలకాలు వేసినా పలు కారణాలతో పనుల ఆరంభంలో జాప్యమైనా.. ఇప్పుడు స్థలసేకరణ పూర్తయినా పనులు చేపట్టకపోవడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వీలైనంత త్వరగా మున్సిపల్ భవన నిర్మాణ పనులు ప్రారంభించి సొంత భవనంలోకి కార్యాలయాన్ని మార్చాలని కోరుతున్నారు.

టెండర్లు పూర్తయ్యాయి



మున్సిపల్ ఆఫీసు కొత్త భవన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కార్యాలయ భవనాన్ని భవిష్యత్తు తరాల అవసరాలకనుగుణంగా నిర్మించాలన్న ఆలోచనతోనే చేపట్టాం. స్థలసేకరణ కారణంగానే జాప్యం జరిగింది. వీలైనంత త్వరలోనే పనులు మొదలవుతాయి.

– మమతారెడ్డి, మున్సిపల్ చైర్మన్

క్లుప్తంగా

సమన్వయంతో పని చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటమాధవరావు

జూలపల్లి: అధికారులు,ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని పెద్దపల్లి ఆర్డీవో వెంకటమాధవరావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో రైతుల భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను,రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఆర్డీవోను కలిసి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట తహసీల్దార్ జయశ్రీ, నాయబ్ తహసీల్దార్ అబూబాకర్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి


మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మి

గోదావరిఖనిటౌన్: 10వ తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని రామగుండం మండల విద్యాధికారి లక్ష్మి అన్నారు. అశోక్‌నగర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు.విద్యార్థులు సెల్‌ఫోన్,టీవీలకు దూరంగా ఉండాలని, మానసిక ఒత్తిడి, భయాందోళనను మనసులో నుంచి తొలగించాలన్నారు. సమయపాలన, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ పరీక్షలలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భవాని, జిల్లా సైకాలజీ రిసోర్స్ పర్సన్ మహేందర్‌రెడ్డి, సైకాలజిస్టు బొట్ల రామస్వామి, నరసింహాపురం, హెచ్‌ఎం శోభన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎమ్మెల్యే దాసరి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఓదెల: మండలంలోని గుంపులలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చిత్రపటానికి గురువారం ఉపసర్పంచ్ గట్టు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఎస్సారెస్పీ కాలువ నీటిని ఈనెల 24 వరకు పొడిగించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సదారెడ్డి, రాజుల కిషన్, వార్డుసభ్యులు మర్రి కుమార్, గాదం శ్రీను, చందర్‌రావు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో సీసీరోడ్ల నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ బొల్లెపల్లి శంకర్ గౌడ్ ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ పుట్టమధు చొరవతో రూ. 12.50 లక్షల నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలుదాసరి సాయికుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, జూలపల్లి ఎంపీటీసీ శివ శంకరయ్య, కార్యదర్శి వెంకటరమణ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఓదెల మండలం బాయమ్మ పల్లెలో..

ఓదెల: మండలంలోని బాయమ్మపల్లెలో సీసీ రోడ్డు పనులను రైతు సమన్వయసమితి మండల చైర్మన్ కావటి రాజు గురువారం ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.17 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తొల్సురి కొంరయ్యయాదవ్, ఎంపీటీసీ శారద, వార్డుసభ్యులు, కో–ఆప్షన్ సభ్యుడు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతుల ఆదాయం రెట్టింపు


ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న అధికారులు

జూలపల్లి: రైతులు అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారించాలని ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి సూచించారు. మండలంలోని పెద్దాపూర్‌లో బొజ్జ నర్సయ్య పంట క్షేత్రంలో గురువారం ఆయిల్‌పామ్ మొక్కలను తిరుమల ఆయిల్‌పామ్ కంపెనీ సీఈవో కేశు కాల్యంకర్‌తో కలిసి నాటారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయిల్ పామ్ చెట్లకు ప్రభుత్వం నాలుగేళ్ల వరకు సబ్సిడీ ఇస్తోందని, అంతర పంటల సాగుకు ప్రోత్సాహం ఉంటుందని వివరించారు. రైతులు ఎక్కువ ఆదాయం వచ్చే ఉద్యాన పంటల సాగుకు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ పామ్ చేస్తే పూర్తిగా ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రత్యూష, ఏఈవో కిరణ్మయి, ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్ రైతులు నరేశ్, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ధర్నా


మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ నాయకులు బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కే.కనక రాజ్, రాష్ట్ర సమితి సభ్యుడు గోసిక మోహన్, జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్ మాట్లాడారు. కార్పొరేషన్ లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు డివిజన్లలోని సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నగర ప్రజలకు శుద్ధిచేసిన మంచినీటిని అందించడంలో అధికారులు పాలకులు విఫలమయ్యారన్నారు. 2009లో శంకుస్థాపన చేసిన కళాభవనం పునాదులకే పరిమితమైందని, గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయక సూసైడ్ స్పాట్ గా మారిందన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నగర మేయర్ బంగి అనిల్ కుమార్ కు సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య, జిల్లా సమితి సభ్యులు కామ్రేడ్ మడికొండ ఓదెమ్మ, మాటేటి శంకర్, ఏఐటీయూసీ నాయకుడు ఎల్లాగౌడ్, నాయకులు కన్నం లక్ష్మీనారాయణ, పదాల కనకరాజు, చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయాలి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: ఉపాధి హామీలో పనిచేస్తున్న 3,874 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయాలని మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల స్వామి వివేక్ పటేల్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతిపత్రం అందిచారు. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తున్నందున అదే విభాగంలో పనిచేస్తున్న వారికీ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేష్ గౌడ్, సత్యనారాయణ రావు, వినయ్, సమ్మయ్య, గోపాల్ ఉన్నారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

సుల్తానాబాద్: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీజ కోరారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో కంటివెలుగును వార్డు కౌన్సిలర్ గొట్టం లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా 18 ఏళ్ల పైబడిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా పంపిణీ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గొట్టం మహేశ్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ, ఎంపీటీసీ కొలిపాక శరణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భూక్య యాదగిరి, పంచాయతీ కార్యదర్శి రమ్య, నాయకులు కొలిపాక మధుకర్‌రెడ్డి, దివాకర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం


మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షురాలు లావణ్య

గోదావరిఖనిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో గురువారం క్లబ్ మగువ అధ్యక్షురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను స్థానిక క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ప్రతి రోజూ కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిసూ కష్టపడే మహిళల కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్త్రీలు ఎక్కడ గౌరవింపబడతారో అక్కడే దేవతలుంటారన్నారు. అనంతరం పలు రంగాల్లో విశేష కృషి చేస్తున్న మహిళలకు సుష్మా స్వరాజ్ అవార్డ్స్–2023 అందజేసి, శాలువాలతో సన్మానించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీవాణి, శ్రీ రామ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ సూర్యదేవర జ్యోతి, ఆపిల్‌కిడ్ ప్రిన్సిపాల్ సునీత, సహారా ఫౌండేషన్ అధ్యక్షురాలు సంతోషిరెడ్డి, పద్మ, ఊపిరి, బాసాని రూపిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం కోసమే భారత్ బచావో సదస్సు


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్యోతినగర్: ప్రజలను చైతన్య పరిచేందుకు భారత్ బచావో జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్లు సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకుడు దుర్గం నగేశ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈనెల 11,12 తేదీల్లో జరుగనున్న భారత్ బచావో సదస్సుకు తన బృందంతో గురువారం బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, రాజ్యాంగం అత్యున్నతమైనదని, రాజ్యాంగాన్ని సవరించాలని ప్రస్తుత పాలకులు ప్రజల్లో దురాలోచనలు నింపుతూ దేశాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి మేధావులు, విద్యావంతులు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజా స్వామ్యవాదులు పాల్గొంటున్నారని తెలిపారు.

కాంగ్రెస్ సభకు తరలిన నాయకులు

పెద్దపల్లిరూరల్: కరీంనగర్‌లో జరిగే హాత్ సే హాత్ జోడో సభకు పెద్దపల్లి నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం తరలివెళ్లారు. కౌన్సిలర్లు సుభాష్‌రావు, సంపత్, నాయకులు మస్రత్, బొడ్డుపల్లి శ్రీను తరలివెళ్లారు.

సుల్తానాబాద్: కరీంనగర్ లో నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభకు సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రి నగర్ నుంచి తరలి వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు చిలుక సతీష్, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి ప్రకాష్ రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దామోదర్ రావు, తదితరులు వెళ్లారు.

కాల్వశ్రీరాంపూర్: కరీంనగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ నేతృత్వంలో భారీగా తరలి వెళ్లారు.

ఎలిగేడు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామరాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు సింగిరెడ్డి ఎల్లవ్వ, దుగ్యాల శ్వేత, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్ రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, తదితరులు సభకు వెళ్లారు.

మహిళలు సాధికారత దిశగా పయనించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత

సుల్తానాబాద్: మహిళలు సాధికారత దిశగా పయనించాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ అన్నారు. గురువారం సుల్తానాబాద్‌లో మున్సిపల్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లాలే ఇంటికి వెలుగుఅని, అది విద్యతోనే సాధ్యమవుతుందని, ఆడ మగ అనే తేడా లేకుండా అందరినీ సమానంగా చూడాలన్నారు. ప్రభుత్వం ఇటీవల 8 రకాల ఉచిత వైద్య సేవలను అందిస్తోందని, మహిళలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం పలు రకాల ఆటలు, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

కాలనీలో మరో దొంగతనం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ సంతోష్‌నగర్‌లో గురువారం ఉదయం దొంగతనం జరిగింది. గోదావరిఖని టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సంతోష్‌నగర్‌కు చెందిన రేశవేని రమేశ్ తన భార్యతో కలిసి బయటకు వెళ్లాడు. 11 గంటలకు ఇంటికి చేరుకోగా.. తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. అందులో దాచి ఉంచిన రూ.2.20 లక్షలు చోరీ అయినట్లు బాధితుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి

జూలపల్లి: గర్భిణులు,అధిక రక్తపోటు, మధుమేహ బాధితులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జన ఔషధీ దివస్‌లో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వో కలీమొద్దీన్, ఎల్‌టీ కిరణ్, స్టాఫ్‌నర్స్ ఆనిస్ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ అనంతరావ్, ఫార్మాసిస్ట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించాలి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను నిర్వహించాలని పాలకుర్తి మండల టీఆర్‌ఎస్ నాయకులు కేశోరాం ఇండస్ట్రీస్ హెడ్ అభయ్ జడేజాను కోరారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంజపూరి నవీన్‌కుమార్, నాయకులు తంగెడ అనిల్‌రావు కలిసి విన్నవించారు. కంపెనీలో పర్మినెంట్ యూనియన్ పదవీకాలం ముగిసి రెండు నెలలు గడిచిపోయాయని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరగా, సానుకూలంగా స్పందించిన అభయ్ జడేజా రెండు, మూడు రోజుల్లో స్థానిక అధికారులతో చర్చించి ఎన్నికల నిర్వహణ తేదీని ప్రకటిస్తామని తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.

మక్కాన్ సింగ్‌కు పలువురి పరామర్శ

రామగుండం: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సోదరుడు శైలేందర్‌సింగ్ ఇటీవల హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి నిరంజన్, బొంతల రాజేశ్, దూళికట్ట సతీశ్, దాసరి విజయ్ తదితరులు మృతుడు శైలేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరితో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రతినిధి, ప్రజా రచయిత దయా నర్సింగ్, పెద్దంపేట ఉప సర్పంచ్ కోడిపుంజుల భూమేశ్, రాజనర్సయ్య తదితరులు పరామర్శించారు.

రాష్ట్రంలో మహిళా రిజర్వేషన్ల కోసం పోరాడాలి

పెద్దపల్లిరూరల్: మహిళా రిజర్వేషన్ల కోసం పోరాటం చేపట్టానని చెప్పుకుంటున్న కవితక్క రాష్ట్రంలో తన తండ్రి కేసీఆర్ పాలనలో మహిళలకు సరైన గౌరవం దక్కేలా పోరాడాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు పర్శ సమ్మయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి చాతరాజు నరేశ్ అన్నారు. లిక్కర్‌స్కాంలో ఇరుక్కుపోయిన కవిత ప్రజల దృష్టిని మరల్చేందుకే ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు.

బాధితకుటుంబానికి స్నేహితుల ఆర్థికసాయం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కాసాని ఐలయ్య ఇల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులకు ఐలయ్య చిన్ననాటి స్నేహితులు గురువారం రూ.15వేలు, బియ్యం, బట్టలు అందించి ఉదారతను చాటుకున్నారు. బాధితులకు ఆర్థిక సాయమందించిన చిన్ననాటి మిత్రులను గ్రామస్తులు అభినందించారు. బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఎన్నిక



ఫెర్టిలైజర్ సిటీ: గౌతమ్ నగర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఆలయ అధ్యక్షుడిగా కే. లింగమూర్తి, వైస్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, సెక్రటరీ రాజయ్య, వెంకటేశ్వరరావు, కిషన్‌తో పాటు ఐదుగురు డైరెక్టర్లను , కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ పదవీకాలం రెండేళ్ల వరకు ఉంటుందని సభ్యులు తెలిపారు.

సీపీకి సన్మానం


సీపీని సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరిని సమాచార హక్కు పరిరక్షణ సమితి నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి, సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ విజయ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థికసాయం

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన తాటికొండ శ్రీరాములు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి రూ.5 వేలు, ఎండీ షఫీ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఆర్థికసాయం అందించారు. ఇందుకు సహకరించిన సభ్యులందరికీ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నారగోని సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మల్యాల విజయ్, మల్యాల నరేష్,రెడ్డి చైతన్య, మెడగోని సాయి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజ


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

యైటింక్లయిన్‌కాలనీ: శ్రీఅయ్యప్ప స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని యైటింక్లయిన్‌కాలనీ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం రాత్రి పడిపూజ మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. శ్రీ అద్దంకి సారంగా చారి గురుస్వామి ఆధ్వర్యంలో బైరి నాగరాజు–మమత దంపతుల కుమార్తె గాయత్రి పుట్టినరోజు సందర్భంగా తన కుటుంబ సభ్యులతో కలసి పడిపూజ నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, స్టాలిన్ గౌడ్, సుధాకర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


బోనం ఎత్తుకొని వెళ్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్: పట్టణంలోని ఆరేపల్లిలో పోచమ్మతల్లి, మహాలక్ష్మీ,భూలక్ష్మీ – బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి బోనమెత్తారు. అమ్మవారిఆశీర్వాదంతోనే అభివృద్ధి, సంక్షేమం ముందుకు వెళ్తుందని అన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్, ఎంపీపీ బాలాజీ రావు, బీజేపీ నాయకుడు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్, కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, గుణపతి, తదితరులు పాల్గొన్నారు.